
AP POSTAL H/RMY/101/2018-20

కోస్తా ఎన్‌కౌంటర్

తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 218 | ఆదివారం, జనవరి 13, 2019 | Contact : 8919754345 | costaencounter@gmail.com | Costaencounterofficial | పేజీలు : 4 | వెల : 3/-

Published from Rajamahendravaram, Circulated in East, West Godavari, Vijayawada, Guntur, Visakhapatnam & Srikakulam



చట్టాల ముసుగులో..
ప్రజాస్వామ్యం ఖూనీ



చట్టాలు..ఉన్న వాడి చుట్టాలు..పవర్ పొలిటీషియన్ చేతుల్లో కీలుబొమ్మలు. వ్యవస్థలను నిర్వీర్యం చేసేలా..హక్కులను హననం చేసేలా పెరిగిపోతున్న రాజకీయ నిరంకుశత్వం.. భారత దేశ ఔన్నత్యాన్ని, సమగ్రతను దెబ్బతీస్తున్నాయి. రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నాయి. మొత్తంగా సమాజ మనుగడకే సవాలు విసురుతున్నాయి. కేంద్రం, రాష్ట్రంలో సాగుతున్న పరిపాలనల తీరు.. ప్రజల్లో అసహనాన్ని పెంచుతున్నాయి. మేధావులను, విద్యావంతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వీటిపై కోస్తా ఎన్‌కౌంటర్ ప్రత్యేక కథనం.

- అస్థిత్వాన్ని కోల్పోతున్న స్వతంత్ర వ్యవస్థలు
- వికృత రూపం దాలుస్తున్న రాజకీయ నిరంకుశత్వం
- ప్రమాదంలో భారతీయ పౌరసమాజం
- పెరుగుతున్న ప్రజానీకం అసహనం

కోస్తా ఎన్‌కౌంటర్, రాజమహేంద్రవరం ప్రతినిధి

భారతదేశం ప్రపంచ దేశాల్లో అత్యంత ప్రత్యేకత కలిగిన ప్రజాస్వామ్య దేశం. ఇక్కడి భిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు..మరెక్కడ కానరావు. అందుకే రెండువందల ఏళ్ళపాటు ఈ దేశాన్ని పాలించిన బ్రిటీష్ వారు సైతం ఈ గడ్డపై నుంచి వెళ్ళిపోయారే గానీ ఇక్కడి అస్థిత్వాన్ని దెబ్బతీయలేకపోయారు. కానీ స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలకే ఇక్కడి పాలకుల తీరు యావత్ భారతావని ప్రస్థానాన్నే ప్రశ్నిస్తోంది. మనల్ని మనమే పరిపాలించు కుందాం.. బానిసత్వపు సంకెళ్ళ నుంచి విముక్తి పొందుదాం అంటూ ఆనాడు స్వతంత్ర్య పోరాటంలో అజరామరమైన త్యాగాలను చేసిన మహనీయులు భారతదేశ భవిష్యత్తును గొప్పగానే ఊహించుకుని ఉంటారు. కానీ దేశంలోని ప్రతీఐదేళ్ళకొకసారి గద్దెనెక్కుతున్న పాలకులు మాత్రం స్వతంత్ర్య సమర యోధులు, త్యాగమూర్తులు ఆశలను నెరవేర్చడం కన్నా..స్వార్ధప్రయోజనాలతో మొత్తం వ్యవస్థనే నిర్వీర్యం చేసే దిశగా అడుగులు - మిగతా 2లో..



కత్తి కట్టకుండా..
కోడిపందెం నేరం కాదు

ఈ సారి ప్రశాంత వాతావరణంలో పందాల నిర్వహణ

నర్సాపురం నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ రఘురామకృష్ణంరాజు

కోస్తా ఎన్‌కౌంటర్, ఆకివీడు :
కత్తి కట్టకుండా చట్టానికి లోబడి కోడిపందెం ఆడడం నేరం కాదని నర్సాపురం నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ రఘురామ కృష్ణంరాజు పేర్కొన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ సంప్రదాయ బద్ధంగా, హింసకు తావులేకుండా కోడి పందాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడం సమంజసమేనన్నారు. కోడి పందాలు ఆపడానికి ఎవరికీ చట్ట ప్రకారం హక్కులేదని అభిప్రాయ పడ్డారు. ఏపి గేమింగ్ యాక్టు ప్రకారం డబ్బులు పెట్టి జూదం ఆడడం నేరమని, అలాగే యానిమల్ యాక్టు ప్రకారం కోళ్ళకు కత్తులు కట్టి కోడి పందాల పేరుతో హింసను ప్రోత్సహించడం నేరమన్నారు. కోళ్ళకు కత్తులు కట్టకుండా కోడి పందాలు ఆడుకోవడం ఎటువంటి నేరము కాదన్నారు. దేశ విదేశాల నుంచి, వివిధ జిల్లాల నుంచి కోడి పం దాలు వీక్షించేందుకు అనేక మంది వస్తున్నారని, పండుగ ఆనందోత్సాహాల మధ్య అందరు జరుపు కోవాలన్నారు. సంప్రదా యంగా వస్తున్న కోడి పందాల కారణంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకూడదన్నారు. ఈ ఏడాది కూడా ప్రశాంత వాతావరణంలో మళ్ళీ, మళ్ళీ ఇక్కడికి రావాలనిపించేలా పోటీలు జరుగుతాయన్నారు.



కోస్తా ఎన్‌కౌంటర్ 2019 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా. రాజమండ్రి కేంద్రంగా వెలువడుతున్న కోస్తా ఎన్‌కౌంటర్ దినపత్రిక ప్రస్తుతం సర్క్యులేట్ అవుతున్న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు,కృష్ణా జిల్లాలతోపాటు మరిన్ని జిల్లాల్లో విస్తరించాలని , దినదిన ప్రవర్ధమానమవ్వాలని కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఆకాంక్షించి శుభాకాంక్షలందించారు.

పోలీసులకు సంక్రాంతి గండం

అందరూ సంక్రాంతి పండుగ మూడు రోజులు సందడిగా జరుపుకుంటే... అదే సంప్రదాయ సంక్రాంతి పండుగ మాత్రం పోలీస్‌కు దినదినగండంగ మారింది. గతంలో సంక్రాంతి పండుగ అంటే ఎంతో ఆనందంగా ఉండే పోలీస్‌కు ఈ పండుగ అంటేనే హడలిపోతున్నారు. పండుగ పుణ్యమా అని కళ్లు మూసుకుందామనుకుంటే పండుగ మరునాడే తాఖీదులు.. ఆ పై వీఆర్‌లు.. పేకాటలపై ఫిర్యాదులు వచ్చేస్తున్నాయి. ఫలితంగా పోలీసు పని సంక్రాంతి పండుగకి ముందు నుయ్యి వెనుగ గొయ్యి అన్న సామెత మాదిరిగా తయారైంది. సంక్రాంతి పండుగ సందర్భంగా మీసం మెలేసే రాజులా ఉండే పోలీసులు ఈ పండుగ పేరు చెబితేనే గుండెల్లో దడపుడుతోంది. ఇందుకు ఉదాహరణ గత ఏడాది జరిగిన కోడి పందాల పుణ్యమా అని పశ్చిమ గోదావరి జిల్లాలోని పోలీసులు, రెవెన్యూ అధికారులు తాఖీదులు అందుకోవడమే.



- ఖాకీయిజం పందెం కత్తికి బలికావాల్సిందేనా?
- లబోదిబోమంటున్న అధికారులు

కోస్తా ఎన్‌కౌంటర్, భీమవరం :
సంక్రాంతి పండుగ అంటేనే గుర్తుకు వచ్చేది గోదావరి జిల్లాలు. ఇక పండుగ నేపథ్యంలో కోడి పందాలు అంటేనే గుర్తుకు వచ్చేది భీమవరం. ప్రతీ ఏటా సంక్రాంతి సమయంలో భీమవరం లాస్‌వెగాస్‌గా మారిపోతుంది. ఇక సంక్రాంతి పండుగకు భీమవరం వచ్చే అతిధులు గురించి చెప్పనావసరం లేదు. అసలు రహదారుల పై ఇసుక వేస్తే రాలనంతగా జనం ఇక్కడి వస్తారు. వారంతా ఇక్కడకు దేశ విదేశాల నుంచి వచ్చి పండుగ మూడు రోజులు సందడిగా జరుపుకోవడం ఆనవాయితీగా వచ్చేసింది. ఇక సంక్రాంతి పండుగ ముసుగులో జరిగే కోడి పందాలు..ఆ పై కోడి పందాల పేరుతో జరిగే జూద జాతర గురించి చెప్పనవసరం లేదు. ఈ పండుగ మూడు రోజులు కోట్లాది రూపాయలు పందాల రూపంలో చేతులు మారుతుంటాయి. ఇక పందాలు - మిగతా 2లో..



డెంగ్యూకి అడ్డా... స్మార్ట్ సిటీ గడ్డ

- పేరుకి స్మార్ట్ సిటీ .. మున్సిపాలిటీ కన్నా అధ్వాన్నం
- నగరంలో పెరిగిపోతున్న డెంగ్యూ పాజిటివ్ కేసులు
- ఫాగింగ్ యంత్రాల వాడకంలోనూ బద్ధకమే
- నిద్రావస్థలో జిల్లా అధికారగణం

కోస్తాఎన్‌కౌంటర్ , కాకినాడ సిటీ :
అసలే కాకినాడ నగరం దోమలకు అడ్డా... మనుషులకంటే 100 రెట్లు ఎక్కువగా ఉంటాయన్నది ఇక్కడి వాసుల అభిప్రాయం. అధికారిక గణాంకాల ప్రకారం ఇంచుమించు ఇలానే ఉంటుందన్నది వారి మాట. అలాంటి నగరంలో దోమల నివారణకు కార్పొరేషన్ అధి కారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కానీ - మిగతా 2లో..

ఒకటి కాదు రెండు కాదు... ముచ్చటగా మూడేళ్ళు అవార్డుల పంట. జిల్లాలో ఉన్న చిన్నా పెద్ద మున్సిపాలిటీలను తోసిరాజంటూ ప్రథమస్థానాన్ని ఖాతాలో వేసుకుంటోంది. ఇదంతా దేశ వ్యాప్తంగా స్మార్ట్ సిటీగా పేరుగాంచిన కాకినాడ నగర పాలక సంస్థ ఈఘనత సాధించింది. ఇంతకీ ఈ ఘనత ఏమిటంటారా ..అదేనండీ.. ఈమధ్య కాలంలో ప్రజలను మంచంమీద నుంచి క్రిందకు దిగకుండా పైకి పంపే వ్యాధి డెంగ్యూ ఉందికదండీ ..దానిలోనే మన ఘనత వహించిన స్మార్ట్ నగర పాలక సంస్థకు అవార్డులు దక్కుతున్నాయండీ. ఏటేటా డెంగ్యూ వ్యాధి గ్రస్తుల రికార్డులను బద్దలు కొడుతూ ముందుకు దూసుకుపోతున్న దానిపై ప్రత్యేక కథనం.

కోడి పందాలు ఆడే ప్రదేశాలపై నిఘా



కోస్తా ఎన్ కౌంటర్ జంగారెడ్డిగూడెం రూరల్ జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న దేవులపల్లి లో 2018 సంవత్సరం లో ఆడిన కోడిపందాలు ఫెన్సింగ్ వేసిన బరులను గుర్తించారు అలాగే దేవులపల్లి లో కొబ్బరి తోట దున్ని చదును చేసి ఉండటంతో వాటిని కూడా గుర్తించారు సంక్రాంతి పండుగ సంప్రదాయం బద్ధంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలి తప్ప జంతుహింస చేసి జరుపుకోవడం సంప్రదాయం కాదన్నారు కోడి పందాలు నిర్వహించకుండా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఈ నేపథ్యంలో పోలీసు యాక్ట్ 30 అమల్లో ఉందని ఎక్కడైనా కోడిపందాలు నిర్వహించిన పేకాటలు గుండాటలు నిర్వహించిన కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు లక్కవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కడైనా కోడిపందాలు పందాలు నిర్వహిస్తే పోలీసువారికి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్సై పరిమి రమేష్ అన్నారు ఆయనతోపాటు స్టేషన్ సిబ్బంది రైటర్ సోంబాబు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు కానిస్టేబుల్ నరేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



కోస్తాఎన్‌కౌంటర్, అమలాపురం :

ఇటీవల అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలకు మీనాక్షి ఫౌండేషన్ ఛైర్మన్ పినిపే బేబి విశ్వరూప్, ఉదయ్ గ్రూప్ సంస్థ సాయం అందించాయి. పట్టణంలోని 18వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో ఇటీవల అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులు గెల్లా వెర్రియ్య, గెల్లా పెద్దిరాజు, ముత్తాబత్తుల అర్జునరావు,ముత్తాబత్తుల చిన సత్యనారాయణ కుటుంబాలను పరామర్శించి ఫౌండేషన్ ద్వారా కుంచే రమణారావు చేతుల మీదుగా బియ్యం, వంట సామాగ్రి, కిరాణా సామాగ్రి, దుస్తులను పంపిణీ చేసారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రమణారావు కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉండ్రు వెంకటేష్, వైసీపీ నాయకులు మెండు సురేష్‌బాబు, ఈతకోట శ్రావణ్, సాధనాల శ్రీను, సిద్ధూ, స్పర్జన్‌రాజు, నక్కా సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జిబిఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో యూత్ మాక్ పార్లమెంట్ 2019

కోస్తా ఎన్‌కౌంటర్, అనపర్తి :

భారతీయ యువతలో సామాజిక చైతన్యం..రాజకీయ అవగాహన పెంపొందించాలన్న ఆలోచనతో భారత ప్రభుత్వం యువజన సంబంధాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యూత్ మాక్ పార్లమెంట్ 2019 పోటీకి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిబిఆర్ విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి(కొండబాబు) తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి జిల్లా స్థాయి ఎంపికల బాధ్య తలను భారత ప్రభుత్వం తమ జిబిఆర్ విద్యాసంస్థలకు అప్పగించి నట్లు వెల్లడించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, యూత్ మాక్ పార్లమెంట్ చైర్మన్ డా ఎం రామారెడ్డి ఈ పోటీలను పర్యవేక్షిస్తు న్నారు. ఆయన ఈ పోటీలకు 18-25ఏళ్ళు మధ్యవయసు కలిగి డిగ్రీ చదివిన, చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆశక్తి కలిగిన వారు ఈనెల 17-19 తేదీల మధ్య జిబిఆర్ కళాశాలలో హాజరు కావాలన్నారు. తమకు అందిన ధరఖాస్తుల నుంచి ప్రాధమికంగా ఎంపిక కాబడిన అభ్యర్థులను ఆహ్వానించి ఈనెల 28న జిబిఆర్ విద్యా సంస్థల సెమినార్ హాలులో యూత్ మాక్ పార్లమెంట్ 2019 నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు స్థానిక పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, ప్రముఖ సంఘ సేవకులు న్యాయనిర్ణేతలుగా వ్యవ హరిస్తారని కొండబాబు తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులలో నలుగురిని ఎంపిక చేసి ఢిల్లీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. జిల్లా స్థాయి యూత్ మాక్ పార్లమెంటులో పాల్గొనే అభ్యర్థులు, పేదరికం, పేదరికం, లంచగొండితనం, పరిసరాలు, వాతావరణ పరిరక్షణ, బేటీ పడావో బేటీ బచావో, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా,ఇంద్ర ధనస్సు, వ్యాధి నిరోధక టీకాలు, ఆయుష్మాన్ భవ, వనసంరక్షణ, కులతత్వం తదితర అంశాలపై మాట్లాడాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలు తెలుసుకోవాలనుకునేవారు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అఫీసర్, నోడల్ అధికారి డా జె సురేష్, సెల్‌నెం. 9441710351 సంప్రదించాలని కోరారు.

ముగిసిన జన్మభూమి - మా ఊరు

కోస్తా ఎన్‌కౌంటర్, ఆత్రేయపురం : మండలంలో ర్యాలి గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ వరప్రసాద్ అధ్యక్షతన జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మభూమి మా ఊరు కార్యక్రమన్ని చాలా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు అన్నారు. గ్రామ సమస్యలు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారం అవుతు న్నాయని తెలిపారు .అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించి పిల్లలకు అన్న ప్రసన్న అంగన్వాడీ స్టాఫ్ చే మా వంట కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులకు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం లబ్ధిదారులకు పెన్షన్లు, రేషన్ కార్డులు, సంక్రాంతి కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లేటి ధనలక్ష్మి మాజీ మండల ఉపాధ్యక్షులు మద్దూరి సుబ్బారావు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వేగేశ్న చంద్ర రాజు, జగన్మోహిని వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ పెనుమత్స సత్యనారాయణ రాజు, గార్లపాటి గోపి, రవిచంద్ర , గ్రామ పార్టీ అధ్యక్షుడు హనుమంతు సత్యనారాయణ, డిఎల్పిఓ డి యజ్ఞ నారాయణ, యండిఓ ఝాన్సీ, ఎం ఆర్ వో పి రామోజీ, ఎంఈవో వరప్రసాద్ కొత్తపేట ఐసిడిఎస్ అధికారిని అనంత లక్ష్మి మరియు వివిధ శాఖల అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

కోస్తా ఎన్‌కౌంటర్, రావులపాలెం : స్థానిక పంచాయతీ పరిధి పోతంశెట్టి కనికి రెడ్డి పార్కు దగ్గర సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి ఎల్. దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాలకు ముఖ్య అతిథులుగా ఎమ్ డిఓ పి జగదాంబహాజరయ్యారు. ఈసందర్భంగా ముగ్గులు పోటీలు,వంటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు మెమెంటోతో పాటు నగదును అందచేశారు. ఈకార్యక్రమంలో ఇఓపిఆర్డి కె వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పోతుమూడి విజయలక్ష్మి, కొవ్వూరు జగన్నాథరెడ్డి, గుత్తుల పట్టాభిరామారావు, కుడుపూడి శ్రీనివాస్, కోట సోమేశ్వర రావు,గుత్తుల రాంబాబు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

డెంగ్యూకి అడ్డా... స్మార్ట్ సిటీ గడ్డ

అదేమీ ఇక్కడ అమలు జరుగటంలేదని అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. గత మూడు సంవత్సరాల నుంచి దోమల వల్ల వచ్చే డెంగ్యూ వ్యాధిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. మున్సిపల్ అధికారులు బయటకు చెప్పకపోయినా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి చెబుతున్న వివరాల ప్రకారం ఇవి స్పష్టమవుతోంది. 2016 సంవత్సరంలో 29 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదవ్వగా.. 2017 వచ్చేసరికి అవికాస్తా 34 కేసులుకు చేరుకుంది. 2018 సంవత్సరంలో అయితే ఏకంగా 137 డెంగ్యూ పాజిటివ్ కేసులు నగరపాలక సంస్థ పరిధిలో నమోదయిట్లు జిల్లా వైద్యశాఖ అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అంటే 2017 నుంచి 2018 వచ్చేసరికి ఐదు రెట్లు పాజిటివ్ కేసులు నమోదవ్వడం సంచలనంగా మారింది. ఇదే ఇప్పుడు నగరంలో జరుగుతున్న అభివృద్ధిని తేటతెల్లంచేస్తోంది. జిల్లాలో ఉన్న ఇతర చిన్నా పెద్దా మున్సిపాలిటీలను తీసుకుంటే వాటి పరిస్థితి ఇంత అధ్వాన్నంగా లేదు. ఆయా మున్సిపాలిటిలో కేవలం సింగిల్ డిజిట్‌కు పరిమితంగానే ఉన్నాయి. కానీ కాకినాడ నగర పాలక సంస్థలోనే రెండంకెల దాటి మూడం కెలకు పరిగెత్తుతోంది. కేవలం ఆరోగ్యశాఖకు సంబంధించిన ఇంత పెద్ద ఎత్తున కేసులు నమోదవుతుంటే నగర పాలక సంస్థ చేపడుతున్న చర్యలు సందేహాన్నిస్తున్నాయి. ఇవన్నీ చూస్తుంటే వీటిని అరికట్టడంలో నగరపాలక సంస్థ విఫలమవుతోందన్న విమర్శలు ప్రభుత్వ లెక్కలు బట్టి బయటపడుతున్న నిజాలు. ఇది కేవలం డిఎంఅడ్‌హెచ్‌వొ ఇచ్చిన వివరాలు ఇలా ఉంటే వాళ్ళ పరిధిలోకి రాని కేసులు ఎన్నిఉన్నాయో అర్థంకావడంలేదు. అధికారిక లెక్కలు కంటే అనధికారిక లెక్కలే అధికంగా ఉంటాయన్న చాలా సందర్భాలలో రుజువైన పరిస్థితులు ఉన్నాయి. డిఎంఅండ్‌హెచ్‌వొ అధికారులు కేవలం గవర్నమెంటు జనరల్ ఆసుపత్రిలో నమోదయిన వివరాలు వీరి దగ్గరకు చేరినవిగా కొంత మంది చెబుతున్నారు. కానీ ప్రయివేటు ఆసుపత్రులలో జాయిన్ అయిన వివరాలు ఎంత వరకూ ఉన్నాయన్న సంగతి ఎవ్వరికీ తెలియదు. ఇలాంటి పరిస్థితులలో అసలు అధికారులు ఏవిధంగా ఇక్కడ పనిచేస్తున్నారో ఇట్టే అర్థమవుతోంది. డెంగ్యూ లాంటి విషజ్వరాలు నమోదవుతున్నాయని తెలిసి కూడా వాటిని తగ్గించడంలో విఫలమవుతున్నారన్న నగ్న సత్యం గత మూడు సంవత్సరాల రికార్డులను బట్టి ఇట్టే చెప్పవచ్చు. ఎప్పుడైనా ఇలాంటి కేసులు నమోదవుతూ పెరుగుతున్నాయంటే యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. కానీ అదేమీ కనిపించడంలేదు. కొన్ని నెలల క్రితం డెంగ్యూకి సంబంధించిన వ్యాధులతో బాధపడుతూ చనిపోవడంతో అది మీడియాలో ప్రముఖంగా రావడంతో వెంటనే జిల్లా యంత్రాంగం అప్పటికప్పుడు చర్యలు తీసుకుంది. కానీ వాస్తవంగా చూస్తుంటే ఆ చర్యలు నిరంతరం కొనసాగించవలసిన అవసరం ఉంది. నగరంలో ఇలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనబడటంలేదు. మళ్ళీ ఏదైనా కేసులు నమోదయి ఎవరికైనా ప్రాణాపాయం మీదకు వస్తే అప్పుడు అధికారిక యంత్రాంగం కదులుతుందన్న మాటలు నగర ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

దోమల దండయాత్ర

ఇప్పటికే దోమల దండు కాకినాడ నగరాన్ని చుట్టిముట్టి ఉంది. నగరంలో ఆరుబయట కూర్చోవాలన్నా.. వీధులలో తిరగాలన్నా దోమలతో చెలగాట మాడవల్సిందే. దోమలలో రెండు రకాల దోమలు ఉంటాయి. అవి ఆడిస్ దోమ, క్యూలెక్స్ దోమ. ఆడిస్ దోమ కుడితే డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి ప్రాణాంతక వ్యాధులు, క్యూలెక్స్ దోమ వల్ల బోదకాలు వాపు వంటివి వస్తాయి. అయితే రెండు దోమలలో అత్యంత ప్రమాదకారి ఆడిస్‌దోమ. ఇది కుడితే మనుషుల ప్రాణాలమీదకు వచ్చినట్లే. ఇదే దోమ ఇప్పుడు నగరంలో ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. వీటి వల్లే డెంగ్యూ, చికెన్ గున్యాలాంటి ప్రాణాంతకమైన వ్యాధులు వస్తుంటాయంటున్నారు. వర్షాకాలంలో దోమ బాధ కొంచెం తక్కువగా ఉన్నా శీతాకాలం, వేసవి కాలంలో నగరంలోని దోమల బాధ చెప్పనవరసరంలేదు. ఇలాంటి పరిస్థితులు కాకినాడ నగరంలో ఉండటానికి కారణం మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తీసుకోవాల్సిన చర్యలు తీసుకోకపోడమేనన్నది బహిరంగ రహస్యం. కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లను 14 హెల్త్ సర్కిల్స్ ఏర్పాటు చేసి శానిటేషన్‌పై పర్యవేక్షణ చేస్తున్నారు. నిత్యం వార్డులలో శుభ్రతకు సంబంధించిన కార్యక్రమాలు చేపడుతున్నా అవి తూతూ మంత్రంగానే ఉంటున్నాయంటున్నారు నగర వాసులు. అయితే దోమల నివారణకు వాడవలసిన ఫాగింగ్ యంత్రాలు మాత్రం 14 సర్కిల్స్‌లోనూ 14 ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి అక్కడ ఉన్న 10 యంత్రాలు మాత్రమే కనిపిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటితోనే మొత్తం కాకినాడ నగరాన్ని దోమల బారి నుండి రక్షించేద్దామనుకొంటున్న పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. ఉన్న ఫాగింగ్ యంత్రాలను కూడా సక్రమంగా వాడుతున్నారా అంటే అదీలేదు. కొన్ని రోజుల పాటు నిరంతరం కొనసాగించి దోమలు చాలా వరకూ తగ్గాయన్న పరిస్థితికి వచ్చినప్పుడు వాటి వాడకం తగ్గిస్తే బాగుంటుంది. కానీ ఆవిధంగా జరగడంలేదు. జన్మానికో శివరాత్రి అన్నట్లు నెలకోసారి అలావచ్చి ఇలా కొట్టిపోతుంటారు. దీని వల్ల అప్పటి కప్పుడు ఉపశమనమే కానీ వాటిని పూర్తిస్థాయిలో నాశనం చేయలేమన్నది వాస్తవం. ఒకటి మాత్రం అధికారులు ఖచ్చితంగా చేస్తారు. ఇప్పటికే కన్సర్వేషన్స్ ఫండ్ నుంచి 70 లక్షల రూపాయలతో యంత్రాలు, దోమల లిక్విడ్స్ వంటివి అధికారులు కొనుగోలుచేసారు. కానీ అవి పెద్దగా వినియోగిస్తున్నట్లు కనబడటంలేదు. అదే కనుక జరిగితే ప్రతీ ఏడాది డెంగ్యూ కేసులు పెంచుకునే పరిస్థితి ఉండదన్నది వాస్తవం. నగరంలో దోమల దండయాత్ర ఏవిధంగా ఉందన్నది నగరంలో తిరిగే వారు ఎవ్వరైనా ఇట్టే చెబుతారు. దానిని బట్టే అధికారులు చర్యలు తీసుకోవాలి. కనీసం ఎన్నుకోబడిన నాయకగణం ఆపని చేయించాలి. కానీ వారు అలాంటి పనులు మాత్రం వారికి చెయ్యట్లేదనడానికి బహిరంగ దోమల విజృంభణే నిదర్శనం.

వ్యాధుల వివరాలు.. గాల్లో లెక్కలు

ప్రతీ ఏడాది పెరిగిపోతున్న డెంగ్యూపై కోస్తాఎన్‌కౌంటర్ విలేఖరి మున్సిపల్ ఆరోగ్య అధికారిని వివరణ కోరినప్పుడు.. గత మూడు సంవత్సరాలకు సంబంధించిన వివరాలు తనకు తెలియదని.. తాను కొత్తగా ఈ పదవిలోకి వచ్చానన్నారు. అయితే జిల్లా కలెక్టర్, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి, మున్సిపల్ కమీషనర్ ఆదేశాల మేరకు అన్ని వార్డులలో ఆరోగ్య శాఖ సిబ్బందిని పెట్టి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకున్నామని గతంలో ఉన్న వాటికంటే ఇప్పుడు చాలా తగ్గుముఖం పట్టాయని అంటున్నారు. ఇప్పటి వరకూ అలాంటి ఫిర్యాదులు తమకు అందలేదని చెబుతున్నారు. అయితే అధికారిగా జాయిన్ అయినప్పటి నుంచీ రికార్డు ప్రకారం ఎన్ని నమోదయ్యాయని అడుగగా తనకు తెలియదని అవి నాదగ్గర ఉండవని చెప్పడం కొసమెరుపు. దీనిని బట్టే అర్థమవుతోంది కార్పొరేషన్ పరిధిలోని వ్యాధుల రిజిస్టర్ నిర్వహణ ఎంత నిర్లక్ష్యంగా చేస్తున్నారో. అదే గనుగ నిజమయితే ఇక నగర ప్రజలను ఆ దేవుడే కాపాడాలి.

పోలీసులకు సంక్రాంతి గండం

అంటే కోడి పందాలేకాదు.. పేకాటలు..కోటాటలు..గుండాటలు.. అబ్బో సింగపూర్‌లో జరిగే జూదాన్ని తలపిస్తోంది. ఇదిలా ఉండగా గత ఏడాది సంక్రాంతి కోడి పందాల ముసుగులో జిల్లాలోని డెల్టాలోని ప్రధానమైన పట్టణంలో లక్షలాది రూపాయల మేర పేకాటలు జరుగుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఆ పట్టణ పోలీసు అధికారి దాడి చేశారు. ఆ పై వారి మీద కేసులు కూడా నమోదు చేశారు. ఇక్కడ వరకు బాగానే ఉంది. మీడియా కూడా ఆ పోలీసు అధికారి చెప్పినట్లు వింటుంది కాబట్టి పేకాట పై దాడి చేశారు.. కొంచెం సొమ్మును పట్టుకున్నాము అని ప్రకటించారు. అయితే ప్రకటించిన సొమ్ము పై పేకాట రాయుళ్ల అసంతృప్తితో పాటు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టుకున్నది ఇంత.. ప్రకటించింది కొంతే అని సరాసరి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఉన్నతాధికారి వెంటనే విచారణతో పాటు లోతైన దర్యాప్తును చేయించడం జరిగింది. ఎందుకంటె ఆ పట్టణ పోలీసు అధికారికి ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేతో మంచి సత్సంబంధాలు కలిగి ఉండటంతో పోలీస్ బాస్ ఆ విధంగ చేసినట్లు సమాచారం. ఇదే పేకాటలో డివిజన్ స్థాయి అధికారి భాగస్వామ్యం కూడా ఉన్నట్లు అప్పట్లో పుకార్లు షికార్లు చేశాయి. అయితే ఆ డివిజన్ స్థాయి అధికారి తండ్రి చంద్రబాబు కుటుంబ సభ్యులకు చెందిన హెరిటేజ్ సంస్థలో పని చేస్తుండటం వల్ల ఆ అధికారి సేఫ్ సైడ్‌లో ఉంచారని సమాచారం. అయితే ఈ పేకాట విషయంలో ఆ పట్టణ స్థాయి అధికారిని మాత్రం పోలీస్ బాస్ వీఆర్‌కు తరలించారు. దీంతో ఈ సంఘటన గోదావరి జిల్లాల్లో పెద్ద సంచలనమైంది. అలాగే మరో పక్క భీమవరం మండలం వెంప గ్రామానికి చెందిన కలిదిండి రామచంద్రరావు కోడి పందాల మాటున పెద్ద ఎత్తున జూదం జరుగుతోందని హై కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసింది. దీంతో పోలీస్‌కు ఈ రెండు సంఘటనలు మెడ పై కత్తి పెట్టినట్లుగా మారింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సంక్రాంతి కోడి పందాలు పోలీస్‌కు ‘గండం’లా మారాయి.

పందెం..ఉద్యోగ సంకటం

కోడి పందాలు ..ఖాకీలకు సవాలుగా మారాయి. ప్రజాప్రతినిధులు..పై స్థాయి అధికారుల ఒత్తిళ్ళ మధ్య పోలీసులు తీవ్రంగా నలిగిపోతున్నారు. న్యాయస్థానాలు ఒక వైపు తీవ్రంగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికి ..పందాలు ఆగే పరిస్థితి కనిపించడం లేదు.కరవమంటే కప్పకు కోపం..వదలమంటే పాముకు కోపం అన్న చందంగా పోలీసుల పరిస్థితి తయారైంది. సంక్రాంతి నెల వస్తోందంటే సరదా మాటెలా ఉన్నా ఎటువంటి చిక్కులు వస్తాయోనన్న భయం ఖాకీలను వెంటాడుతోంది. పేకాట, కోడిపందాలు, గుండాట వంటి జూదక్రీడలను అరికట్టేందుకు శతవిధాల ప్రయత్నించినా..ముందస్తుగా ప్రజలకు ఎంత అవగాహన కల్పించినా జూదమోజు మాత్రం నానాటికి పెరిగిపోతోంది. ఎవరినన్నా పట్టుకుని కేసులు పెడదామనుకుంటే వెంటనే నాయకులు రంగంలోకి దిగడం..పోలీసులపై వత్తిళ్ళు తీసుకురాడం మామూలైపోయింది. ఇక కోడిపందాల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పశ్చిమ గోదావరి జిల్లాలో రాత్రి సమయంలో కోడి పందాలు నిర్వహిస్తున్న ఒక గ్రామంలోకి సివిల్ డ్రెస్‌ల్లో పోలీసులు ప్రవేశించి దాడులు చేయడం..ఇద్దరు యువకులు తప్పించుకుని పారిపోయే క్రమంలో బావిలో పడి మరణించడం సంచలనం రేపింది. ఈఘటనపై ఇప్పుడు తీవ్ర స్థాయిలో దుమారం చెలరేగడంతోపాటు విచారణ కూడా సాగుతోంది. ఏది ఏమైనప్పటికీ సంక్రాంతి పండుగ సమయంలో పోలీసులకు విధి నిర్వహణ జీవన మరణ్మరణ సమస్యగా మారింది.

ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పత్రికలు పని చెయ్యాలి : ఉండి ఎమ్మెల్యే శివరామరాజు

కోస్తా ఎన్ కౌంటర్, ఆకివీడు : ఫోర్త్ ఎస్టేట్ గా పిలువ బడే పత్రికలు సమాజ శ్రేయస్సు కోసం, ప్రభుత్వానికి, ప్రజలకు మద్య వారిది లా పని చెయ్యాలి అని ఉండి ఎమ్మెల్యే శివరామరాజు అన్నారు. శనివారం ఆకివీడు మండలం అయి భీమవరం గ్రామంలో కోస్తా ఎన్ కౌంటర్ నూతన సంవత్సర క్యాలండర్ ను మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, కనుమూరి రఘురామ కృష్ణంరాజు లతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు, అభివృద్ధి కొరకు పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు మద్య వారిది లా పని చెయ్యాలి అని, జర్నలిజం అంటే ఇంకా గౌరవం పెంపొందించడానికి కృషి చేయాలని



కోరారు. కార్యా క్రమంలో కనుమూరి ఆనంద వర్మ, చిట్టి రాజు, చిన్ని, వైస్ ఎంపీపీ రామారావు, వాడపల్లి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలను కాపాడటం మనందరి బాధ్యత : ఉండి ఎమ్మెల్యే శివరామరాజు





కోస్తా ఎన్ కౌంటర్, ఆకివీడు : గ్రామీణా సంప్రదాయ క్రీడలను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉండి ఎమ్మెల్యే వేటు కూరి వెంకట శివ రామరాజు అన్నారు. శనివారం ఆకివీడు మండలం అయి భీమవరం గ్రామంలో, అయి భీమవరం యూత్ ఆధ్వర్యంలో, 12,13,14, తేదీలలో జరిగే నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను ఉండి ఎమ్మెల్యే శివరామరాజు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నరసాపురం, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ క ను మూరు రఘు రామ కృష్ణం రాజు లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా యువత మన పూర్వీకుల నుండి వస్తున్న సాంప్రదాయ క్రీడలు, కబడ్డీ, హింస లేకుండా కోడి పందాలు, ముగ్గుల పోటీలు, వంటి అనేక సంప్రదయ క్రీడలు నిర్వహించు కోవటం మన సంప్రదాయం అని అన్నారు. వీటిని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలలనుంచి స్నేహితులు, బంధువులు, వస్తుంటారని, రఘు రామ కృష్ణం రాజు అన్నారు. సంప్రదాయ బద్దంగా, హింసకు తావు లేకుండా, చట్ట ప్రకారం నిర్వహించటం, నేరం కాదు అన్నారు. అనంతరం కను మూ రు బాపిరాజు, ఎమ్మెల్యే శివరామరాజు, రఘు రామ కృష్ణం రాజు లు కొద్దిసేపు కబడ్డీ అడారు. కార్య క్రమంలో నిర్వాహకులు కను మూ రు ఆనంద వర్మ, వైస్ ఎంపీపీ నౌ కట్ల రామారావు, అల్లూరి సోమ రాజు, కనుమురు అనిల్ ప్రసాద్, విలేఖరి సూరి బాబు, చిట్టి రాజు, శివాజీ, కలిదిండి నగేష్ రాజు, తస్సె ల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

చట్టాల ముసుగులో.. ప్రజాస్వామ్యం ఖూనీ

వేస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం. దేశంలో ప్రస్తుతం బిజెపి నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం పరిపాలన సాగిస్తోంది. అంతకు ముందు కాంగ్రెస్ సారథ్యంలోని యుపిఏ పరిపాలన చేసింది. ఇక్కడ కాంగ్రెస్, బిజెపిల రూపంలో రెండు జాతీయ పార్టీలు దేశాన్ని పాలించాయి. ఇక సమైక్యాంధ్రను ముక్కలు చేయడంలో ఈ రెండు పార్టీలు పోటీలు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లోను, తెలంగాణాలోను వేర్వేరు ప్రభుత్వాలు చరిత్ర గతిలో తమ పేర్లను లిఖించుకున్నాయి. కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని బిజెపిది ఒక రకమైన నిరంకుశత్వమైతే..ఆంధ్రా, తెలంగాణాలలో మరో రకమైన ఇష్టారాజ్యాలు కొనసాగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపుతున్న సిబిఐ డైరెక్టర్ అలోక్ వర్మను తొలగించిన వైనం అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన, దేశంలోనే అత్యున్నత దర్యాప్తు సంస్థ డైరెక్టర్‌ను అత్యంత అవమానకర రీతిలో ప్రధాని మోదీ ఇంటికి సాగనంపిన ఘటన అందరిని ఆలోచింపచేస్తోంది. బిజెపి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతున్న రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు స్కాముకు సంబంధించి సిబిఐ విచారణ సాగుతున్న సమయంలో గత అక్టోబరులో రాత్రికిరాత్రి మోదీ సర్కారు తీసుకున్న నిర్ణయాలు ప్రతిపక్షాలనే కాదు ప్రజా స్వామ్య వాదులను, దేశపౌరులను దిగ్భ్రాంతికి గురి చేసాయి. ఇక దేశ ఆర్థిక వ్యవస్థకు మూలంగా ఉన్న రిజర్వ్ బ్యాంకు విషయంలోను కమలనాథుల మితిమీరిన జోక్యం చర్చనీయాంశంగా మారింది. నోట్ల రద్దు నిర్ణయం..అప్పటి ఆర్‌బిఐ గవర్నర్ రఘురాం రాజన్ వ్యతిరేకించిన తీరు..ఆ తర్వాత మోదీ ప్రసన్నతతో పదవిని అలకరించిన ఉర్జిత్ పటేల్ ఉదంతం ఇవన్నీ మితిమీరిన రాజకీయ జోక్యానికి అద్దం పడుతున్నాయి. కేంద్రంలోని మోదీ సర్కార్ వత్తిళ్ళకు తాళలేక ఇటీవల ఉర్జిత్ పటేల్ కూడా రాజీనామా చేసి వెళ్ళిపోవడం రిజర్వ్ బ్యాంకు చరిత్రలో చీకటి అధ్యాయం. ప్రజాస్వామ్యానికి కీలకమైన స్థంభంగా పేర్కొనే న్యాయ వ్యవస్థలోను బిజెపి పాలకులు వేలు పెట్టడం..న్యాయమూర్తులు దేశచరిత్రలో ఎన్నడూ లేని విధంగా బహిరంగంగా విమర్శలకు దిగడం ఆందోళనకర అంశాలే. ఈ విధంగా చాలా వ్యవస్థల్లో కేంద్రంలోని ప్రస్తుత బిజెపి పెత్తనం శృతి మించి రాగాన పడింది. ఇవే కాదు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి), రాష్ట్రాలకు గవర్నర్ల నియామకాలు తదితర అంశాలలోను మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్‌కంట్యాక్స్ (ఐటి), సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలను తమ చేతుల్లో కీలు బొమ్మలుగా మార్చుకుని..ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు మొదలుకొని కీలకమైన నాయకుల వరకు అందరినీ బెదిరింపులకు గురి చేస్తూ కొత్త తరహా రాజకీయానికి తెరలేపారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

చట్టసభల సాక్షిగా..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో కూడా కేంద్రానికి ఏ మాత్రం తీసిపోని విధంగా ఇష్టారాజ్య పాలన చాపకింద నీరులా పెరిగిపోతోంది. తెలంగాణాలోని టిఆర్ఎస్ ప్రభుత్వం, ఆంధ్రాలోని టిడిపి ప్రభుత్వాలు తమ పవర్‌ను స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఆంధ్రా, తెలంగాణాలో టిడిపి, టిఆర్‌ఎస్‌పార్టీలకు వ్యతిరేకంగా వేరే పార్టీలలో పోటీ చేసి గెలిచిన శాసన సభ్యులు ఆతర్వాత టిడిపి, టిఆర్‌ఎస్‌లలో చేరి పోయారు. ఒకపార్టీ గుర్తుపై పోటీ చేసి..ప్రజలు వేసిన ఓట్లతో ఆపార్టీ అభ్యర్థిగా గెలుపొంది ఆ తర్వాత టిడిపి, టిఆర్‌ఎస్‌లలో చేరి పోవడమే కాదు, ఏమాత్రం సిగ్గులేకుండా అసెంబ్లీ సమావేశాల్లోను పాల్గొంటూ వచ్చారు. దీనిపై తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లలో తీవ్రస్థాయిలోనే చర్చ జరిగింది. తెలంగాణాలో కాంగ్రెస్, టిడిపి, వైసిపిల తరపున పోటీ చేసి ఆ తర్వాత టిఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్న వారికి కేసిఆర్ మంత్రి పదవులు కట్టబెట్టారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో నెగ్గిన వైసిపి ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి చంద్రబాబు టిడిపిలోకి చేర్చుకుని మంత్రి పదవులు కట్టబెట్టారు. వీరంతా శాసనసభా సమావేశాల్లో పాల్గొంటూ.. మంత్రులుగా అధికారాన్ని చలాయిస్తున్న.. ఘనత వహించిన గవర్నర్‌గారికి కనిపించకపోవడం విడ్డూరం. ఇక పార్టీ ఫిరాయింపుల చట్టం కింద వీరిపై అనర్హత వేటు వేయాలని సదరు అసెంబ్లీల స్పీకర్లకు ఆయా పార్టీలు ఫిర్యాదులు చేసినా వాటిపై ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడం సిగ్గు చేటు. ఈ విధంగా గవర్నర్, స్పీకర్ వంటి రాజ్యాంగ బద్ధ పదవులలో కొనసాగుతున్న వారు ఏకపక్ష ధోరణితో..కళ్ళున్న దృతరాష్ట్రుల వలె వ్యవహరించడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ.

ఎందుకీ ముసుగు?

ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదంటారు..కానీ వాటిని తయారు చేసే ఫ్యాక్టరీలు, పరిశ్రమలపై ఏవిధమైన చర్యలు తీసుకోరు. బహిరంగ మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లను అమ్ముతున్న హోల్‌సేల్ వ్యాపారులు, విక్రయదారులను ఏమి చేయరు. కవర్లు కొనుగోలు చేసి వినియోగించే సామాన్యులపై మాత్రం జరిమానాలు విధిస్తారు. మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరం అంటారు. కోట్లు ఖర్చు చేసి మరీ వీటిని వినయోగించ రాదంటూ ప్రచారం చేస్తారు. అంతేగానీ మద్యపాన నిషేదాన్ని మాత్రం అమలు చేయరు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చట్టరిత్యా నేరం. ఇది దేశ వ్యాప్తంగా ఎప్పుడో అమలులోకి వచ్చింది. కానీ వీటిని అమలు చేసే వ్యవస్థలే సక్రమంగా పని చేయడం లేదు. ప్రతీ ఏటా ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి వస్తోందంటే కోడి పందాలు నిర్వహించడం సంప్రదాయం. కానీ న్యాయస్థానాలు మొదలుకొని పోలీసు బాస్‌ల వరకు చట్టం పేరుతో కోడిపందాలపై ఉక్కుపాదం మోపుతామంటారు. చివరికి పాలకులు, ప్రజాప్రతినిధుల రాజకీయ జోక్యం, పెత్తనంతో మూడు రోజులపాటు ఈ పందాల నిర్వహణకు గేట్లెత్తేస్తారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకున్నామంటూ అనధికారికంగా పోటీలకు అనుమతులు ఇస్తారు. ఈ విధంగా మన దేశంలో పేరుకే చట్టాలు. అమలులో మాత్రం చట్టుబండలే. చట్టాలనే ముసుగులో రాజకీయ అధికారం కలిగిన వారు సమాజంలో పెద్దమనుషులు తమ ఇష్టానికి అనుగుణంగా వ్యవస్థను సర్వ నాశనం చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని, దేశసమగ్రతను దెబ్బతీస్తున్నారు.

కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కోస్తా ఎన్ కౌంటర్, జీలుగుమిల్లి : సంక్రాంతి పండగ ముసుగులో ఎవ్వరైనా కోడిపందాలు నిర్వహించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎం.వీరబాబు పందెంరాయుళ్లను హెచ్చరించారు. రానున్న సంక్రాంతి పండగ సందర్భంగా గౌరవ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం కోడిపందాలు, పేకాట, గుండాట, వంటి చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొనపడతాయని ఆయన తెలిపారు. తహశీల్దార్ ఎం.రాజశేఖర్ తో కలిసి జాయింట్ టీంగా ఏర్పడి అన్ని గ్రామాలలో ఆటో మైక్ ద్వారా ప్రచారం చేస్తూ పలు చోట్ల సమావేశాలు ఏర్పాటు చేసి గోడ పత్రికలు, బ్యానర్లు ద్వారా ప్రజలకు అవగాహన చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పందాలు నిర్వహించే, నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కాగా జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2017 డిసెంబర్ నుండి ఇప్పటి వరకు కోడిపందాలు ఆడుతున్న 32 వ్యక్తులపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుండి 17,360 రూపాయలు 9 కోళ్లు 5 కత్తులను స్వాధీనం చేసుకుని వారిని కోర్టులో హాజరు పరిచామని, అలాగే పేకాట ఆడుతున్న 18 మందిపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుండి 28,910 రూపాయలు స్వాధీన పరుచుకుని కోర్టు వారి ఎదుట హాజరు పరిచామని, కోడి పందాలు, పేకాట నిర్వహించనున్న 42 మంది నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేసి వారిని మండల ఎగ్జిక్యూటివ్ కోర్టు నందు హాజరు పరిచినట్లు తెలిపారు. కావున గౌరవ హైకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం మండల పరిధిలో కోడిపందాలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం, నిర్వహించడం నేరం వాటిని అతిక్రమించినవారు చట్ట ప్రకారం కఠినంగా శిక్షింపబడతారని తెలియచేశారు.

పించన్ రెట్టింపుతో లబ్దిదారుల జీవితాలలో ఆనందపు కాంతులు

జడ్పీటీసీ బాసిన రాజబాబు



కోస్తా ఎన్ కౌంటర్, జీలుగుమిల్లి : ఫిబ్రవరి నెల నుండి 12 రకాల పింఛన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెట్టింపు చెయ్యడం ద్వారా ఒక్కసారిగా లబ్ధిదారుల జీవితాలలో ఆనందపు కాంతులు విరజల్లినట్లు అయ్యిందని జడ్పీటీసీ బాసిన రాజబాబు అన్నారు. స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద నూతనంగా మంజూరు అయిన పెంక్షన్లను అర్హులకు ఆయన అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 55 లక్షల మందికి పెంక్షన్లు రెట్టింపు చెయ్యడం అభినందనీయమని కొనియాడారు. అలాగే మండలంలో సుమారు 3వేల మందికి పెంక్షన్లు ఇస్తున్నామని అలాగే జన్మభూమి-మావూరు ద్వారా 197 పెంక్షన్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరు మళ్ళీ చంద్రబాబు నాయుడుకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఒక్కసారిగా పెంక్షన్లు రెట్టింపు చెయ్యడం ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఉండవల్లి సోమసుందరం, ఏఎంసి డైరెక్టర్ సుంకవల్లి సాయి పంచాయితీ సెక్రటరీ నాగిరెడ్డి పెంక్షన్ దారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సదస్సుకు ఆదిత్య ఫోరెన్సిక్ విద్యార్థులు



కోస్తాఎన్‌కౌంటర్, గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ క్యాంపస్ నందు గల ఆదిత్య డిగ్రీ కళాశాల, ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థులు ఈనెల 9 వ తారీకు నాడు నాగపూర్ లో జరిగిన కార్పొరేట్ ఫోరెన్సిక్స్ & మేధో సంపత్తి హక్కుల సంబంధిత ఒకరోజు జాతీయ స్థాయి సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సును గవర్నమెంట్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఫోరెన్సిక్ సైన్స్, నాగపూర్ వారు నిర్వహించగా సదస్సులో భాగంగా ఫోరెన్సిక్ రంగానికి సంభందించిన అంశాలను చర్చించారుబీ 'కార్పొరేట్ ఫోరెన్సిక్స్ - ఏ న్యూ హెూరిజోన్', "మేధో సంపత్తి హక్కులు" అనే నేపథ్యంపై డా. రంజిత్ సింగ్ మరియు శ్రీ పంకజ్ బోర్కర్ సెమినార్ ప్రదర్శించారు. ఇటు వంటి అరుదైన ఫోరెన్సిక్ సదస్సులను, సమావేశాలను విద్యార్థులు తప్పని సరిగా పాల్గొని వారి విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఏ. జీ. బీ. ఎస్. డైరెక్టర్ డా. ఎన్. సుగుణ రెడ్డి విద్యార్థులకు సూచించారు. సదస్సులో పాల్గొని ప్రశంసా పాత్రలను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఈ.మోహన్ అభినందించారు.

ఆదిత్యలో ఘనంగా జాతీయ యువజన దినోత్సవ వేడుక



కోస్తాఎన్‌కౌంటర్, గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ క్యాంపస్ నందు గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం వివేకానంద జయంతి (12జనవరి 1863)వేడుకలు ఘనంగా నిర్వహించారు.జ్యోతి ప్రజ్వలన కావించి శ్రీ స్వామి వివేకానందుని చిత్రపటానికి క్యాంపస్ డైరెక్టర్ మరియు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎమ్.శ్రీనివాసరెడ్డి పూల మాలవేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వామి వివేకానంద కేవలం 32 సంవత్సరాలు మాత్రమే జీవించి ఉన్నప్పటికీ యావత్ ప్రపంచంలో గల మానవజాతికి అమూల్యమైన భావజాలాన్ని అందించి చిరంజీవిగా అందరి హృదయాలలో నిలిచారని కొనియాడారు. భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ నలుచెరుగులా చాటిన మహెూన్నత వ్యక్తి, నిత్య స్ఫూర్తి ప్రదాత అని ప్రసంగాలలో వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ డా. వి.శ్రీనివాసరావు, డా. ఎస్.రమాశ్రీ,హెడ్ ఆర్&డి. డా. కె.వి. శ్రీరామచంద్రమూర్తి, కంట్రోలర్ ఆఫ్ ఎక్సమినేషన్స్ (సి.ఇ)జె.పవన్, గ్రంథాలయ శాఖ ప్రధాన అధికారి కె. అశోక్ వివిధ విభాగాధిపతులు, శ్రీశారదరామకృష్ణసేవాసమితి, పెదబ్రహ్మదేవం సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే

చినమిల్లిపాడుకు బస్ సౌకర్యం కల్పిస్తా

వైసిపి ఉండి నియోజక వర్గ కన్వీనర్ పీ వీ ఎల్ నరసింహరాజు





కోస్తా ఎన్ కౌంటర్, ఆకివీడు : వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని తీర్చే విధంగా, మీ ముందుకు వస్తున్నారని ప్రజలు దివించాలని వైఎస్సార్ పార్టీ ఉండి నియోజక వర్గ కన్వీనర్ పీ వీ ఎల్ నరసింహ రాజు అన్నారు. శనివారం ఆకివీడు మండలం కళింగ పాలెం, చినమిల్లి పాడు గ్రామాల్లో జగన్ రావాలి, జగన్ కావాలి, కార్యక్రమంలో పీ వీ ఎల్ నరసింహ రాజు, అయి భీమవరం అబ్బాయి రాజు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తు కి ఓటు వేయాలని కోరారు. ఆకివీడులో, సిద్దాపురం, కుప్పన పూడి, కళింగ పాలెం, లలో పేదల కోసం రాజ శేఖర్ ద్వారా స్థలం సేకరించ టం జరిగిందని, ఈ రోజు వరకు ఎమ్మెల్యే వక్క సెంటు భూమి పేదలకు పంపిణీ చెయ్య లేదు అని అన్నారు. సిద్దాపురం రోడ్డు మార్గం పూర్తి గా పాడై పోయింది అని,10 ఏళ్ళు గా రోడ్డు వేయలేదని అన్నారు. తాను అధికారంలో కి రాగానే ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని, బస్ సౌకర్యం కల్పిస్తా నని పీ వీ ఎల్ నరసింహ రాజు అన్నారు. కళింగ పాలెం కు వంతెన సౌకర్యం కల్పించి ప్రజల అవసరం తీర్చామన్నరు. జగన్ మోహన్ రెడ్డి నవరత్నాల పథకాలతో మీ ముందుకు వస్తున్నా రని ఫ్యాన్ గుర్తు కి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అయి భీమవరం అబ్బాయి రాజు మాట్లాడుతూ నవరత్నాలలో జగన్ మోహన్ రెడ్డి పేదలకు, వ ృద్దులకు, వితంతువులకు,2 వేలు పెన్షన్ ఇస్తా నన్నరని, అది చూసి , భయపడి ఈ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 2 వేలు పెన్షన్ ఇస్తా అని ప్రకటించింది అని, అయిన ప్రజలు ఈ ప్రభుత్వ అబద్ధపు మాటలు నమ్మరన్నరు. కార్యా క్రమంలో మండల అధ్యక్షుడు మురళీ, ఉండి మండల అధ్యక్షుడు, అచ్చా రావు, ఎంపీటీసీ లు మోర జోతీ, పండు, అంబటి రమేష్, మధు, హుస్సేన్, దిలీప్, జగిదిష్, రామ కృష్ణ, బాలాజీ, గ్లాడ్ సన్, పగొలు రాజు, జహంగీర్, కిస్ మిస్ రావు, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భోగి పండుగతో ముగుస్తున్న గొబ్బెమ్మల పండుగ



కోస్తాఎన్‌కౌంటర్ (రాయవరం) : ధనుర్మాసం ప్రారంభం అయినప్పటి నుండి కన్నె పిల్లలు ప్రతి రోజు వేకువజామునే నిద్రలేచి, చల్నీటితో తల స్నానం చేసి, సంప్రాదాయమైన వస్త్రాలను ధరించి ముంగిట్లో ముగ్గులు పెట్టుకుని ఆవు పెడతో గొబ్బెమ్మలను చేసి ఆ ముగ్గులతో గొబ్బెమ్మలను పెడతారు. యింటిలో తులసికోట దగ్గర ముగ్గులు వేసి కృష్ణుని ఫోటో పెట్టి ఆవుపెడతో చేసిన అయిదు గొబ్బెమ్మలను వేసిన ముగ్గులలో పెట్టి పూజచేసి గొబ్బెమ్మ పాటలు మరియు కృష్ణుని పాటలు పాడుకుని అయిదుగురు ముత్తయిదువుటకు తాంబులాలు యిచ్చి పూజ ముగిస్తారు. గొబ్బెమ్మలను గోదాదేవి స్వరుపంగాను మరియు కృష్ణుని భక్తురాల్లు అయిన గోపికలుగా పరిగణిస్తారు. అట్లే ప్రతి శనివారం తెల్లవారుజామున పూజతో పాటు సాయంత్రం వేళలో చుట్టుప్రక్కల వున్న కన్నెపిల్లలు, బంధువులు అందరు కలిసి గొబ్బెమ్మలకు పూజలు చేసి పాటలు పాడుకుంటూ ఆనందంగా సంక్రాంతి సందడిగా గడుపుతారు. యీ సంప్రాదాయం ఎక్కువగా పల్లెగ్రామములో ఎక్కువగా చేస్తారు. యీ గొబ్బెమ్మల పూజలు పండుగ వాతవరణంను తలపిస్తాయి. యీ గొబ్బెమ్మల పూజలు కూడా నెల రోజులు పూర్తి చేసుకుని భోగి పండుగ రోజున బంధువులు, కన్నె పిల్లలను పిలుచుకుని పూజలు ముగించుకుని పాటలు పాడుకుని 33 మంది ముత్తాయిదువులకు తాంబులాలు, కృష్ణుని ప్రతిమలను యిచ్చి వారికి బోజనాలు పెటతారు. యీ రకంగా మూడు సంవత్సరాల చేస్తారు. యీ దృష్యలు అనపర్తి గ్రామములో పొలమూరుకు చెందిన కర్రి కావ్యసాహితి, కర్రి సత్యశ్రీలక్ష్మి అక్కచెల్లెల్లు యిద్దరు గొబ్బెమ్మ పూజలు చేస్తున్న దృష్యలు. యింటిలో ఆడపిల్లలు వున్న వారు అందరు తప్పకుండా యీ గొబ్బెమ్మల పూజలను చేయించడం చాల మంచిదని పండితులు, పెద్దలు చెబుతున్నారు.

పించన్లకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరణ



కోస్తా ఎన్‌కౌంటర్, రాయవరం : మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని అర్హులైన వారు అందరికి పించన్లు యిచ్చే కార్యక్రయం చేపట్టారని అనపర్తి మండలం, పొలమూరు గ్రామ అభివృద్ధి కమిటి చైర్మెన్ ద్వారంపూడా ఈశ్వరరెడ్డి అన్నారు. గ్రామములో అర్హులైన వారి నుండి వృద్ధాప్య పించన్లు, వికలాంగా పంచన్లు, వితంతు పించన్లు మరియు ఒంటరి మహిళ పించన్లకు సంబందించిన దరఖాస్తులను, అవసరమైన పత్రములను తీసుకుని వారికి వెను వెంటనే పించన్లు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటూన్నారు. యీ సందర్బముగా ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామములోను లేని విధంగా పార్టీలకు అతీతంగా అర్హులైన వారు అందరికి పించన్లు వచ్చే కార్యక్రమం చేస్తున్నమని మా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వారి సారధ్యంతో గ్రామములో ఎన్నో అభివృద్ధి కార్యక్రమములు చేశామని, మా గ్రామఅభివృద్ధికి ఎమ్మెల్యే గారు ఎంత గానే సహకరిస్తున్నరని జనవరి నెల నుండి పించన్లు రూ.1,000-/ల నుండి రూ. 2,000/-లు పెంచారని ఇక నుండి అర్హులైన పించన్లు దార్లు అందరికి నెలకు రూ. 2,000/-లు యిస్తున్నమని తెలిపారు. పించన్లు పెంపుదల వల్ల పేదప్రజలు ఆనంద వ్యక్త చేస్తున్నరని, ప్రజా సంక్షేమానికి కట్టుబడి వున్న ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమని, మన రాష్ట్రామునకు ఆర్థిక వనరులు లేకపోయిన ఏ అభివద్ధి కార్యక్రమమును నిలుపుదల చేయకుండా ఎంతో అనుభవంతో మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని నడిపిస్తున్నరని అట్లే మన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గారు కూడా నియోజివర్గ పరిదిలో యిప్పటి వరకు ఏ ఎమ్మెల్యే చేయలేని అభివృద్ధి పనులు చేశారని ప్రజలు తిరిగి తెలుగుదేశం పార్టీని అధికారములోనికి తేవటానికి సిద్దంగా వున్నరని తెలిపారు.

యువతపై 'దూలం' కన్ను

- క్రీడలతో యువకులకు 'గాలం'
- ఓట్ల రాజకీయంపై జోరు పెంచిన డిఎన్నార్
- వివిధ క్రీడల నిర్వహణతో యువతను ఆకట్టుకునే ప్రయత్నం
- వాలీబాల్ కిట్లు పంపిణీ, క్రికెట్ టోర్నమెంట్‌లతో యువ ఓట్లను కొల్లగొట్టే ప్లాన్
- సంక్రాంతి సీజన్‌లో చెడు వ్యసనాలకు క్రికెట్‌తో చెక్ పెట్టే యత్నం
- కైకలూరులో డిఎన్నార్ సీరిస్ ప్రారంభంతో యువతలో క్రేజ్ పెంచుకున్న డిఎన్నార్





కోస్తాఎన్‌కౌంటర్, కైకలూరు : వైయస్ఆర్‌సిపి కైకలూరు నియోజకవర్గ సమన్వయకర్త దూలం నాగేశ్వరరావు(డిఎన్నార్) ఎన్నికల ప్రణాళికలో బాగంగా ఓటర్లను ఆకర్షించేందుకు యమ స్పీడ్‌తో ముందుకెళుతున్నారు. నియోజకవర్గ ఓటర్లలో యాభై శాతం ఉన్న యువతను ఆకట్టుకునేందుకు క్రీడా పోటీల నిర్వాహణతో జోరు పెంచారు. సంక్రాంతి సీజన్‌లో సాధారణంగా కోడి పందాలు, పేకాట, గుండాట వంటి క్రీడలు జరుగుతూ ఉంటాయి. ఇవన్నీ చట్టవ్యతిరేక కార్యాకలపాలే. అయితే చెడు వ్యసనాలకు యువత బలి కాకుడదన్న ఉద్దేశ్యం ఓ వైపు.. అదే సందర్బంలో స్పోర్ట్స్‌లో క్రేజ్ ఉన్న క్రీడలను నిర్వహించడం ద్వారా యువతను ప్రోత్సహించడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో తన వైపు తిప్పుకోవడం ద్వారా ఓట్లను రాబట్టుకోవాలన్న ప్రణాళిక మరో వైపు అన్నట్లు తెలివైన నిర్ణయంతో డిఎన్నార్ దూసుకెళుతుండటంతో ఇప్పుడు కైకలూరు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీస్తుంది. డిఎన్నార్ సీరిస్ పేరుతో భారీ క్రికెట్ టోర్నమెంటును కైకలూరు వైవిఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. దీని ప్రారంభోత్సావానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త కోటగిరి శ్రీధర్ ముఖ్య అతిధిగా హాజరై డిఎన్నార్ సీరిస్‌ను ప్రారంభించారు. కాగా ఈ సీరిస్ ప్రారంభోత్సవానికి రాజకీయాలకు అతీతంగా నాయకులు హాజరు కావడంతో డిఎన్నార్ క్రికెట్ సీరిస్‌పై కైకలూరు రాజకీయ వర్గాల్లో చర్చ మెదలైంది. మరో మూడు నెలలు ఎన్నికలు సమీపిస్తున్న నేపద్యంలో డిఎన్నార్ తెలివిగా యువ ఓటర్లపై దృష్టి పెట్టి తన ప్రణాళికను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. 15 రోజులు క్రితం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న అన్నీ గ్రామాల వాలీబాల్ క్రీడాకారులకు ఉచితంగా వాలీబాల్ క్రీడా సామాగ్రి అందజేయడంతో నియోజకవర్గ వ్యాప్తంగా యువతలో దూలం కు క్రేజ్ అమాంతం పెరుగుతూ వస్తుంది. ఇప్పుడు డిఎన్నార్ సీరిస్ పేరుతో యమ క్రేజ్ ఉన్న క్రికెట్ క్రీడాకారులకు గాలం వేయడంతో యువతపై డిఎన్నార్ పట్టు సాధించినట్లేనని పలువురు వ్యాఖ్యనిస్తున్నారు. గత 10ఏళ్లుగా నిరంతరం ప్రజల్లోనే ఉంటూ అన్ని వర్గాల ప్రజల్లో తనదైన గుర్తింపు పొందిన దూలం ఇపుడు క్రీడల నిర్వాహణతో యువతను ఆకర్షిస్తుండటంతో వచ్చే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజల ఓట్లు డిఎన్నార్ కొల్లగొట్టడం ఖాయమంటూ పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతుంది. కాగా ఈ డిఎన్నార్ సీరిస్‌కు నియోజకవర్గం క్రీడాకారుల నుంచి భారీగా స్పందన లభించింది. ఏకంగా 156 టీంలు సీరిస్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపటంతో ఇప్పుడు కైకలూరులో క్రికెట్ పండుగ వాతావరణం నెలకొన్నట్లు కనిపిస్తోంది. ఇదిలా ఉంటే శనివారం ప్రారంభమైన డిఎన్నార్ క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమంలో వైయస్ఆర్‌సిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నోబుల్, దాసరి అబ్రహం లింకన్, కైకలూరు ప్రముఖ యువ నాయకులు కె.వి.ఎం. నాయుడు, సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు యర్రా సురేంద్ర, డిఎన్నార్ సీరిస్ ఆర్గనైజేషన్ సభ్యులు కిరణ్, ప్రసాద్, శర్మ, నాగు, సతీష్, సుధీర్, వైసిపి నేతలు చావల రజనీకాంత్, సోమల శ్యాంసుందర్, షాబుద్దీన్, శింగంశెట్టి రాము, దూలం వినయ్‌కుమార్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలంటూ వినతి



కోస్తా ఎన్ కౌంటర్, కొత్తపేట : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో తగినంత సిబ్బంది, సౌకర్యాలు లేనందున నిరసిస్తూ స్థానిక తహసీల్దార్‌కి కొత్తపేట నియోజకవర్గ జనసేనపార్టీ నాయకులు బండారు శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు నామడి శివాజీ తాళ్ల డేవిడ్ రాజు చిక్కం శివాజీ నాయుడు, రామచంద్రుడు బండారు బాబీ తోట స్వామి కికరాజు పవన్ మణికంఠ దులం సాయి గనిశెట్టి సాయి నాధ్ నాయుడు సలది చిన్న తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి తరానికి స్ఫూర్తిదాయకం.. వివేకానందుని జీవితం



కోస్తా ఎన్ కౌంటర్, జీలుగుమిల్లి : ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచిన స్వామి వివేకానంద జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం కావాలని వారి సందేశాలు నిత్య ఆచరజేయమైనవని వాల్మీకి విజ్ఞన కేంద్రం పాఠశాల పరిపాలనధికారి తనికెళ్ళ సత్యరవికుమార్ తెలిపారు. వంకా వారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాల నందు శనివారం స్వామి వివేకానంద 156వ జయంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో గల వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్.వి.ఎస్ సుబ్రహ్మణ్యం, సోమా అన్నవరం, పిట్ల ప్రసాద్ రెడ్డి, మాధవరెడ్డి, దుర్గాప్రసాద్, శివశంకర్, కామేశ్వరి, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

రూరల్లో వైసిపి కార్యాలయం ప్రారంభం



కోస్తాఎన్‌కౌంటర్, కడియం : రాజమండ్రి రూరల్ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఆకుల వీర్రాజు ఆధ్వర్యంలో రాజమండ్రి రూరల్లో వైసిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. హుక్కుంపేట నుండి బాలాజీ పేట వెళ్లేదారిలో తుమ్మ లోవలో ఈ కార్యాలయాన్ని వైసిపి నాయకులు వై వి సుబ్బారెడ్డి చేతుల మీదగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాజమండ్రి పార్లమెంటరీ కోఆర్డినేటర్ మార్గాన్ని భరత్ రామ్, కవురు శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెదపూడిలో సంక్రాంతి సంబరాలు



కోస్తాఎన్‌కౌంటర్, బిక్కవోలు : పెదపూడి ఎండీఓ ఆఫీస్ వద్ద 'సంక్రాంతి సంబరాలు' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఏఎంసి మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, అన్నవరం దేవస్థానం మెంబర్ దేవానందరెడ్డి, జెడ్పీటీసీ వరప్రసాద్, ఎంపీపీ సూర్యకుమారి, మండల పార్టీ అధ్యక్షులు కృష్ణ, మండల పార్టీ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ దత్తుడు, ఆత్మ కమిటీ డైరెక్టర్ పేర్రెడ్డి, సొసైటీ అధ్యక్షులు గంగాధర్ చౌదరీ, అమ్మన్న, ఎంపీటీసీ శివ రామరెడ్డి, ఆదినారాయణరెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

గోవుని పూజించడం.. జన్మ సార్థకం

కోస్తా ఎన్‌కౌంటర్, జీలుగుమిల్లి : హిందువులకు పూజనీయమైనటువంటి గోవుని పూజించడం ద్వారా జన్మ సార్థకం అవుతుందని గోఆధారిత వ్యవసాయానికి గోవుని సంరక్షించుకోవడం ద్వారా గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని హిందూధర్మ ప్రచార పరిషత్ .టీటీడీ. జిల్లా ప్రధాన కార్యదర్శి తనికెళ్ళ సత్యరవికుమార్ అన్నారు. మండలంలోని అంకంపాలెం కోదండ రామాలయం నందు శుక్రవారం రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అర్చకులు ఎమ్.వి.ఎస్ సుబ్రహ్మణ్యం విశిష్టంగా గోపూజ కార్యక్రమం నిర్వహించి గోవు యొక్క విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో రెడ్ల సుబ్బారావు, జి.జగన్, ఏ.దుర్గమ్మ, డి.లక్ష్మయ్య, ఎం.సుబ్బారావు, పి.నర్సయ్య, వి.నరసింహారాజు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



రివ్యూ



'పటాస్', సుప్రీమ్, 'రాజా ది గ్రేట్' ఈ మూడు చిత్రాలు చాలు దర్శకుడిగా అనిల్ రావిపూడి టేకింగ్ ఏంటో! ప్రేక్షకులను కితకితలు పెడుతూనే కమర్షియల్ ఎలిమెంట్స్ జోలికి పోకుండా హీరోయిజాన్ని ఎలివేట్ చేయడం ఎలాగో ఆయనకు తెలుసు. ఇక కామెడీ టైమింగ్‌లో వెంకటేష్ గురించి వేరే చెప్పనక్కర్లేదు. తన 30ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో అలాంటి పాత్రలెన్నో చేశారు. మరి వీరిద్దరికీ యువ కథానాయకుడు వరుణ్ తేజ్ కూడా కలిస్తే ఆ ఫన్ రెండింతలవుతుంది. కానీ, తమన్నా, మెహరీన్‌లను పెళ్లి చేసుకున్న తర్వాత ఫన్ పోయి ఫ్రస్ట్రేషన్ ఎలా వచ్చింది? ఆ ఫ్రస్ట్రేషన్‌లో వాళ్లు ఏం చేశారు? సంక్రాంతి అలుల్లకు ఎదురైన అనుభావాలేంటి? చూడాలంటే 'ఎఫ్2'కు వెళ్లాల్సిందే!

కథేంటంటే: హారిక(తమన్నా), హనీ(మెహరీన్) అక్కా చెల్లెళ్లు. వెంకీ (వెంకటేష్) ఒక ఎమ్మెల్యే దగ్గర పీఏగా పనిచేస్తుంటాడు. హారికను పెళ్లి చేసుకుంటాడు. అప్పటివరకూ సాఫీగా సాగిపోతున్న వెంకీ జీవితం పెళ్లితో ఒక్కసారిగా మారిపోతుంది. భార్య, అత్త వెంకీని తమ చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు యత్నిస్తుంటారు. వరుణ్ యాదవ్ (వరుణ్‌తేజ్) హనీని ఇష్టపడతాడు. అప్పటికే అత్తింటి పరిస్థితులు అర్థమైన వెంకీ.. హనీని పెళ్లి చేసుకోవద్దని వరుణ్ యాదవ్‌ను హెచ్చరిస్తాడు. ప్రేమ మత్తులో వరుణ్‌కు ఇవేవీ పట్టవు. చివరకు హనీని పెళ్లి చేసుకుంటాడు. అప్పటి నుంచి అక్కాచెల్లెళ్ల ఆధిపత్యానికి తోడళ్లులు నలిగిపోతుంటారు. మీరిద్దరూ ఎక్కడికైనా వెళ్లిపోండని, అప్పుడే అక్కాచెల్లెళ్లకు మీ విలువ తెలిసి వస్తుందని, పక్కింటి వ్యక్తి(రాజేంద్రప్రసాద్) ఈ తోడల్లుళ్లకు సలహా ఇస్తాడు. దీంతో ఇద్దరూ యూరప్ వెళ్తారు. అయితే, వెంకీ.. వరుణ్‌లతో పాటు, హారిక.. హనీలు కూడా యూరప్ వెళ్తారు. వీరందరూ ప్రకాష్‌రాజ్ ఇంట్లో తిష్ట వేస్తారు. ఇంతకీ వీళ్లు యూరప్ ఎందుకు వెళ్తారు? పక్రాష్‌రాజ్ ఇంట్లోనే ఎందుకు దిగారన్నది అసలు కథ. చివరకు పెళ్లాల మనసు మార్చారా? లేక వీళ్లే మారిపోయారా? అన్నది తెరపై చూడాల్సిందే!

ఎలా ఉందంటే: ఇద్దరు భార్య బాధితుల జీవితాలు ఎలా ఉంటాయి? ఆ ఇంట్లో ఎలాంటి వినోదం పుడుతుంది? అన్నదాని నుంచే పుట్టింది ఈ సినిమా. దర్శకుడు ముందు నుంచీ ఇది భార్య బాధితుల సినిమా అని చెబుతూనే ఉన్నాడు. వారు పడే ఇబ్బందుల నుంచి ఫన్ ఎలా పుట్టుకొచ్చిందనేది సినిమాలో చూపించాడు. ప్రతి ఇంట్లోనూ జరిగే విషయాలే స్క్రీన్‌పై కనిపిస్తాయి. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరీ'లాంటి చిత్రాల్లో వెంకటేష్ చేసిన పాత్రలు మళ్లీ ఈ మధ్య కాలంలో చేయలేదు. చాలా రోజుల తర్వాత ఆ స్థాయి పాత్రలో వెంకటేష్‌ను చూస్తాం. తొలి సగం పూర్తిగా వినోద ప్రాధాన్యంగా దర్శకుడు నడిపించాడు. ప్రతి సీన్‌ను నవ్వులతో పండించాడు. ప్రతి పాత్రకు ఒక ప్రత్యేకత ఉంటుంది. మెహరీన్‌కు కూడా ఒక మేనరిజం ఇచ్చి, ఆ పాత్ర ప్రత్యేకంగా కనిపించేలా చేశాడు. అత్తారింటిలో వెంకటేష్ చూపించే ఫ్రస్ట్రేషన్ చూసి కచ్చితంగా నవ్వుకుంటారు. సందర్భోచిత కామెడీ రాసుకోవడంలో దర్శకుడు విజయం సాధించాడు. ద్వితీయార్థం మొత్తం యూరప్ చుట్టూ తిరుగుతుంది. అయితే, ప్రథమార్థంలో ఉన్న బలం ద్వితీయార్థంలో కనిపించదు. కానీ, ఈ రెండు జంటలు మధ్య వచ్చే సన్నివేశాలు మాత్రం కిక్ ఇస్తాయి. చివరిలో నాజర్ పాత్ర ప్రవేశించడం కూడా కలిసి వచ్చేదే. అక్కడ కూడా డైలాగ్‌లు చాలా బాగున్నాయి. మొత్తంగా ఇది ఒక ఫన్ రైడ్ సినిమా. కథగా చెప్పాల్సి వస్తే, ఇదేమీ గొప్ప కథ కాదు. గతంలో 'సందడే సందడి', 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి!' వంటి చిత్రాల ఛాయల్లోనే సాగుతుంది. సందేశాల జోలికి వెళ్లకుండా, మరీ కమర్షియల్ హంగులవైపు పరుగులు తీయకుండా సున్నితమైన వినోదాన్ని చక్కగా ఆవిష్కరించాడు దర్శకుడు. అయితే, వినోదాన్ని పండించడంలో కొన్ని చోట్ల శ్రుతి మించినట్లు అనిపిస్తుంది. పాత్రలు కూడా కొన్నిసార్లు ఓవర్‌గా ప్రవర్తిస్తున్నాయనిపిస్తుంది. ఫస్టాఫ్‌లో ఉన్న బిగి ద్వితీయార్థంలో రాదు. అక్కడక్కడా సన్నివేశాలను పేర్చుకుంటూ వెళ్లిపోవడంతో కాస్త సాగదీతగా అనిపిస్తుంది.

ఎవరెలా చేశారంటే : వెంకటేష్ చాలా కాలం తర్వాత తన స్థాయికి తగ్గ వినోదం అందించే పాత్రలో కనిపించారు. పాత చిత్రాల్లో వెంకటేష్ ఎలా నవ్వించారో ఈ సినిమాలో అలాగే నవ్వించారు. ఇద్దరు తోడల్లుళ్ల ఫ్రస్ట్రేషన్ అనే కన్నా, వెంకటేష్ ఫ్రస్ట్రేషన్ అంటే బాగుంటుందేమో! ఎందుకంటే ఆయన పాత్రే సినిమాలో హైలైట్. వరుణ్ తేజ్ కూడా చక్కగా నటించాడు. తెలంగాణ యాసలో మాట్లాడాడు. అయితే, ఆ యాస వరుణ్‌కు కృత్రిమంగా అనిపించింది. తమన్నా చాలా రోజుల తర్వాత పూర్తి స్థాయి కథానాయికగా కనిపించింది. మెహరీన్ కూడా పర్వాలేదనిపించింది. రఘుబాబు, రాజేంద్రప్రసాద్, ప్రకాష్‌రాజ్, నాజర్‌లు ఇలా ప్రతి పాత్ర నవ్వించడానికి ఉద్దేశించిందే! అన్నపూర్ణ, వై.విజయ జోడీగా కనిపించి నవ్వులు పంచారు. రచయితగా అనిల్‌రావిపూడి బాగా సక్సెస్ అయ్యాడు. తన బలం వినోదమే. దాన్ని సాధ్యమైనంతవరకూ ప్రతి సీన్‌లో పండించ డానికి ప్రయత్నించాడు. కానీ, ఎఫ్2 చాలా చిన్న కథ. తొలి సన్నివేశాల్లోనే మనకు అర్థమైపోతుంది. ట్విస్టులు, హంగులవైపు వెళ్లలేదు. మొదటి నుంచి చివరి వరకూ ఒకేలా ఉంది. దేవిశ్రీ ప్రసాద్ అందించిన సంగీతం పర్వా లేదు. అయితే, పాటలు అన్నీ ఆకట్టుకోలేదు. యూరప్‌లో తెరకెక్కించిన పాట మాత్రం బాగుంది. కెమెరా పరంగా కలర్‌ఫుల్‌గా ఉందీ సినిమా. నిర్మాణ విలువలు బాగున్నాయి.

ప్రజలు మళ్లీ చంద్రబాబునే ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారు

- వైఎస్సార్‌సీపీ నాయకులు పగటి కలలు కంటున్నారు
- ఎమ్మెల్సీ సోము నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ ఆదిరెడ్డి



కోస్తాఎన్‌కౌంటర్, రాజమహేంద్రవరం సిటీ : ప్రజల శ్రేయస్సు కోసమే నిత్యం ఆలోచిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడినే రాష్ట్ర ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి ఇప్పటి వరకూ నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన స్పందనే అందుకు నిదర్శమన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జన్మభూమికి వచ్చిన ప్రజలను అడగ్గా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతున్నాయని సమాధానంగా చెప్పారని వివరించారు. ప్రతి ఒక్కరికీ చంద్రన్న కానుకలు అందుతున్నాయన్నారు. రుణ మాఫీ అందరూ పొందారని, రాజమహేంద్రవరం నగరంలో 4314 మహిళా సంఘాల్లోని 43,140 మందికి రూ. 10 వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో వేశారని వివంచారు. ఇటీవల పెన్షన్లు పెంచారని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేస్తున్నారని తెలిపారు. పాత వాటితో కలిసి 12 రకాలు పెన్షన్లు ఇచ్చేందుకు తెలుగుదేశం ప్రభుత్వం చర్యలు తీవసుకుంటోందన్నారు. ఇల్ల కోసం పక్కువగా దరఖాస్తులు వస్తున్నాయని, రాజమహేంద్రవరం పరిధిలో 100 ఎకరాలు కొనుగోలు చేసి 20 వేల ఇళ్లు నిర్మించనున్నట్టు తెలిపారు. చంద్రబాబుపై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. లోకేష్‌పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శలు చేయడం తగదన్నారు. లోకేష్ అంటే ఆ పార్టీ నాయకులకు భయం పట్టుకుందని, అందుకే లోకేష జపం చేస్తున్నారని మండిపడ్డారు. తండ్రిని మించిన తనయుడు లోకేష్ అని కొనియాడారు. లోకేష్ పాదయాత్ర చేయగలరా అని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ప్రశ్నించారని... జగన్ కంటే పెద్ద వయస్సు కలిగిన చంద్రబాబునాయుడు 208 రోజులు ఎండలో నడిచారని గుర్తు చేశారు. ఆ పార్టీ నాయకులు జీతాలు తీసుకుంటూ శాసన సభ, శాసన మండలికి రాకుండా ఎగ్గొడుతున్నారని విమర్శించారు. తన ఆధ్వర్యంలో పోలవరం సందర్శనకు ఇప్పటి వరకూ 142 బస్సుల్లో సుమారు 7 వేల మందిని పంపానని చూసి వచ్చిన వారంతా చాలా గొప్పగా చెబుతున్నారని తెలిపారు. మహిళలకు పసుపు - కుంకుమ పథకం కింద మరో రూ. 10 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో వేసేందుకు చంద్రబాబు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదన్నారు. రాష్ట్రంలో బీజేపీ పనైపోయిందని, ఒక్క ఓటు కూడా బీజేపీ పడదన్నారు. ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలు మళ్లీ చంద్రబాబునే కోరుకుంటున్నారని, 2019లో ఆయనే ముఖ్యమంత్రి అని అన్నారు. ఆదివారం స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించి విజేతలకు విలువైన బహుమతులు అందచేయనున్నట్టు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతి ఉంటుందన్నారు. అలాగే టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 600 మంది మహిళలకు ఉషా కుట్టు మిషన్లు అందచేయడంతో పాటు ఒక్కొక్కరికీ రూ. 3 వేలు ఉపకార వేతనం అందచేస్తున్నామన్నారు. ఫిబ్రవరిలో మరో 600 మందికి, మరో రెండు నెలల్లో మరో 600 మందికి కుట్టు మిషన్లు అందచేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు కడలి రామకృష్ణ, బెజలడ రాజ్‌కుమార్, కోసూరి చండీ ప్రియ, నాయకులు బొమ్మనమైన శ్రీనివాస్, మానే దొరబాబు, కడితి జోగారావు, తురకల నిర్మల, బుడ్డిగ రాధ, బుడ్డిగ రవి, పితాని కుటుంబరావు, నేమాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

కోస్తాఎన్‌కౌంటర్, బిక్కవోలు : బిక్కవోలు జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్స్‌లో 'సంక్రాంతి సంబరాలు' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, అన్నవరం దేవస్థానం మెంబర్ దేవానందరెడ్డి, ఎంపీపీ వేణమ్మ, ఎంపీటీసీ పద్మావతి, మాజీ సర్పంచ్ జ్యోతి, ఆదినారాయణరెడ్డి, వీరభద్రరావు, మండల, గ్రామ నాయకులు పాల్గోన్నారు.





10 మంది అరెస్టు : సిఐ క్రిస్టోఫర్



కోస్తా ఎన్‌కౌంటర్, రాజోలు : రాజోలు సర్కిల్ పరిధిలోని కోడి పందేల బరులు ఏర్పాటు చేసిన వారిని 10మందిని అరెస్టు చేసినట్లు సిఐ క్రిస్టోఫర్ తెలిపారు. 'కోస్తా ఎన్‌కౌంటర్' ప్రతినిధితో శనివారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు పేకాటలు గుండాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అసంఘటిత కార్యక్రమాలు నిర్వహించకుండా ప్రజలకు అవగాహన కల్పించామని అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. రాజోలు మలికిపురం సఖినేటిపల్లి మామిడికుదురు మండలాల్లో పోలీసు రెవెన్యూ అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీలు ఏర్పాటు చేశా మన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీ నుండి 28వ తేదీ వరకు 144సెక్షన్ అమలులో ఉంటుంద న్నారు. రాజోలు సర్కిల్ పరిధిలో 22కేసులు నమోదు చేసి 41 మందిని బైండోవర్ చేశామన్నారు .102కోడి కత్తులు, ఆరు కోళ్లు, 7 వేల నలభై రూపాయలు స్వాధీనం చేసుకుని పది మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ప్రజలంతా సంక్రాంతిని శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు.

సమయపాలన పాటించని ఫార్మాసిస్టు!

కోస్తా ఎన్‌కౌంటర్, కుక్కునూరు : పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలంలోని పిహెచ్‌సి ఆసుపత్రిలో పనిచేస్తున్న ఫార్మసిస్ట్ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉద్యోగ సమయం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అయినా సమయపాలన పాటించడం లేదని చెబుతున్నారు. ఈ ఫార్మాసిస్ట్ ఏ సమయానికి వస్తారో రారో వచ్చినా.. ఎప్పుడు వెళ్ళిపోతారో తెలియక మండలంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. ఏదైనా అత్యవసర సమయంలో మందులు కావాలి అంటే ఫార్మసిస్ట్ ఇవ్వాల్సిందే. కానీ ఈ పీహెచ్‌సీలో మందులు ఇవ్వకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఫార్మాసిస్టు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు వెళుతుందో తెలియక రోగులు అసహనానికి గురువుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఈ పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్ పోస్టు ఖాళీగా ఉంది. అందుకుగాను ఫార్మసిస్ట్ జంగారెడ్డిగూడెం నుంచి వస్తున్నారు. అక్కడినుంచి రావడం వలన సరైన సమయానికి రాకపోవడంతో వచ్చినా.. అలా వచ్చి ఇలా వెళ్లిపోవడంతో మాత్రల విషయంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఫార్మాసిస్టును నియమించి రోగులకు మందులు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



తెలుగుదనం ఉట్టిపడేలా.. వైసిపి సంక్రాంతి సంబరాలు

- ముగ్గుల పోటీకి అనూహ్య స్పందన
- జగన్ పాలనలోనే ప్రజలకు సంతోషం : నేతలు





కోస్తాఎన్‌కౌంటర్, రాజమహేంద్రవరం : నగర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సుబ్రహ్మణ్యం మైదానంలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలుగుదనం ఉట్టిపడేలా, మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతూ సంబరాలు నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు సంప్రదాయ దుస్తులలో వేడుకలకు హాజరయ్యారు. సంక్రాంతి సంబరాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉభయ గోదావరి జిల్లాల సమన్వయకర్త, మాజీ ఎంపి వైవి సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా భోగి మంటను వెలిగించారు. వైకాపా మహిళలు భోగి పిడకల దండలను భోగి మంటలలో వేశారు. అనంతరం పిడకల పొయ్యిపై పాలు పొంగించారు. సాంప్రదాయబద్ధంగా ధాన్యాన్ని రోకలిలో వేసి దంచారు. ఈ సందర్భంగా వైకాపా నిర్వహించిన ముగ్గుల పోటీకి అనూహ్య స్పందన లభించింది. సుమారు 200 మంది పోటీలలో పాల్గొన్నారు. ప్రాంగణం సంక్రాంతి శోభ సంతరించుకునే విధంగా గంగిరెద్దులు, హరిదాసులు, ఎద్దులు బండి, చిలక జ్యోతిష్యుడు, కోడి పుంజులను ఏర్పాటుచేశారు. వైవి సుబ్బారెడ్డి, పార్లమెంట్ కోఆర్డినేటర్ మార్గాని భరత్, రౌతు సూర్య ప్రకాశరావు, నందెపు శ్రీనివాస్, కవురు శ్రీనివాస్‌లు కోడి పుంజులతో సందడి చేశారు. ఈ సందర్భంగా రౌతు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు నేతలు మాట్లాడుతూ జగన్ పాలనలోనే రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిధి వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మన సాంప్రదాయాలను కాపాడే విధంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం పట్ల నగర నేతలను అభినందించారు. రైతులు అంతా సంతోషంగా ఉండాలన్నారు. నగరంలో జీవిస్తున్నప్పటికీ మనమంతా గ్రామీణ వాతావరణం నుంచి వచ్చిన వారమేనని, నేటి నగర జీవితంలో పడి మన సంస్కృతి, సంప్రదాయాలను మరచిపోకుండా సాంద్రాయాలకు అద్దంపట్టేలా సంక్రాంతి సంబరాలు జరపడం ప్రసంశనీయమన్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించి, సుమారు రూ.3లక్షల విలువైన బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. నగర కోఆర్డినేటర్ రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో మన సాంప్రదాయాలను పరిరక్షించే విధంగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. సంబరాలు ఘనంగా నిర్వహించడానికి కృషిచేసిన మాజీ ఫ్లోర్‌లీడర్ పోలు విజయలక్ష్మి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మిలను అభినందించారు. నగర అధ్యక్షులు నందెపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారని, ఇదే ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో వైకాపా ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలుపించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి, జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాల్నారు. ఫ్లోర్‌లీడర్ మేడపాటి షర్మిలరెడ్డి మాట్లాడుతూ హామీలు నెరవేర్చని తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను భోగిమంటల్లో వేయాలన్నారు. సంక్రాంతికి సాంద్రాయబద్ధంగా ఎగురవేసే గాలిపటంలా వైఎస్సార్ జెండా పైకెగరాలని, జగన్ సిఎం కావాలని ఆకాంక్షించారు. పార్లమెంట్ అధ్యక్షులు కవురు శ్రీనివాస్, రూరల్ కోఆర్డినేటర్ ఆకుల వీర్రాజు తదితరులు మాట్లాడారు. సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా, విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతిఒక్కరికి పోలు విజయలక్ష్మి, మార్తి లక్ష్మిలు కృతజ్ఞతలు తెలియజేశారు. వైకాపా కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి, జగన్‌ను సిఎం చేయడానికి కృషి చేయాలన్నారు. వైసిపి సిజిసి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, వైసిపి యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజాలు ప్రాంగణాన్ని సందర్శించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు బొంత శ్రీహరి, మజ్జి నూకరత్నం, పిల్లి నిర్మల, ఈతకోటి బాపన సుధారాణి, నాయకులు కర్రి పాపారావు, మార్గాని నాగేశ్వరరావు, పొలసానపల్లి హనుమంతరావు, పోలు కిరణ్ మోహన్‌రెడ్డి, అడపా హరి, మేడపాటి అనిల్‌రెడ్డి, మజ్జి అప్పారావు, మార్తి నాగేశ్వరరావు, భీమవరపు వెంకటేశ్వరరావు, వాకచర్ల కృష్ణ, సోమి శ్రీను, పెదిరెడ్ల శ్రీనివాస్, నీలపాల తమ్మారావు, నీలం గణపతి, ఉప్పాడ కోటరెడ్డి, కోడికోట సత్తిబాబు, సుంకర శ్రీను, రేగుళ్ళ బాలశ్రీధర్, కట్టా సూర్యప్రకాశరావు, బురిడి త్రిమూర్తులు, కుక్క తాతబ్బాయి, గుడాల ఆదిలక్ష్మి, షబ్నం అప్సర్, హాసీనా బేగం, కాటం రజనీకాంత్, పెంకే సురేష్, గుడాల ప్రసాద్, కొమ్ము జిగ్లర్, పాలూరి శ్రీనివాస్, బాల మురళీకృష్ణ, చోడిశెట్టి సత్యవాణి, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **Jillella Kaladhara Babu,** Published at D.No. 4-15 Subbaraopeta, Rajahmundry, PIN CODE :533103, East Godavari District, Andhra Pradesh and Printed at Neo Press D.No.6-84, Saibaba Puntha Road, Hukumpet, Rajahmundry, PIN CODE :533103, East Godavari District. Andhra Pradesh. Editor : **Jillella Kaladhara Babu**, RNI No. 74435/2016. Ph. 8919754345. Email : costaencounter@gmail.com. AP POSTAL H/RMY/101/2018-20